# పేదల సంక్షేమానికి బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో


జహీరాబాద్‌లోని గడీలో ఎమ్మెల్యే మాణిక్‌రావును ఆశీర్వదిస్తున్న ముస్లిం మహిళ


జహీరాబాద్ పట్టణంలోని గడీలో ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ మహిళా నేతలు


జహీరాబాద్‌లోని గడీలో ఎమ్మెల్యే మాణిక్‌రావుపై పూలవర్షం కురిపిస్తున్న ఓటర్లు

**స్థానికుడిని.. ఆదరించి గెలిపిస్తే సమస్యలు పరిష్కరిస్తా**

**జహీరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొనింటి మాణిక్‌రావు**

జహీరాబాద్, నవంబర్ 4: అరవై ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదని జహీరాబాద్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కొనింటి మాణిక్‌రావు అన్నారు. శనివారం జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని 19, 20, 21, 22 వార్డుల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలిచ్చి, ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. బీఆర్‌ఎస్ పేదల సంక్షేమానికి మంచి మ్యానిఫెస్టో తీసుకువచ్చిందన్నారు. రూ. 5 లక్షల బీమా సౌకర్యం, కేసీఆర్ ఆరోగ్యరక్ష పథకం, రేషన్‌కార్డుదారులకు సన్న బియ్యం, పేద మహిళలకు రూ. 3 వేలు జీవనభృతి, రూ.400 లకే గ్యాస్ సిలిండర్ అంటూ మ్యానిఫెస్టో వివరాలను ప్రజలకు వివరిస్తూ ఓటు వేయమని కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేది లేదని, ఆరు గ్యారెంటీలు ఇచ్చేది లేదని ఎద్దేవా చేశారు. జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధిక నిధులు మంజూరు చేసిందన్నారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓట్లు వేసి ఆశీర్వదించాలని ఓటర్లు మాణిక్‌రావు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో టీఎస్‌ఐడీసీ చైర్మన్ తన్వీర్, రైల్వే బోర్డు సభ్యుడు షేక్ ఫరీద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జి.గుండప్ప, బీఆర్‌ఎస్ నాయకులు తంజీం, శ్రీకాంత్‌రెడ్డి, నామ రవికిరణ్, శ్రీనివాస్ నాయక్, జైరాజు, బండిమోహన్, రాకేశ్, మంజూల, అనూషమ్మ తదితరులు పాల్గొన్నారు.

---


ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని సత్కరిస్తున్న చిన్నతరహా పారిశ్రామికవేత్తల సంఘం ప్రతినిధులు

## 24 గంటల కరెంట్‌తో
# పరిశ్రమలకు జీవం

**పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

పటాన్‌చెరు, నవంబర్ 4: బీఆర్‌ఎస్ పాలనలో కోటికాంతుల్లో తెలంగాణ వెలిగిపోతున్నదని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పటాన్‌చెరు పట్టణంలోని జీఎమ్మార్ కన్వెన్షన్‌హాల్‌లో చిన్నతరహా పరిశ్రమల సమాఖ్య ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీఆర్‌ఎస్‌కు ఏకగ్రీవంగా మద్దతు ఇస్తున్నామని వారు ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాకముందు కాంగ్రెస్ పాలనలో పారిశ్రామిక వాడల్లో వారంలో మూడు రోజుల విద్యుత్ కోతలు ఉండేవన్నారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సమగ్ర విద్యుత్ సరఫరా విధానంతో పరిశ్రమలకు 24గంటల నాణ్యమైన విద్యుత్ లభిస్తున్నట్లు తెలిపారు. నిరంతర విద్యుత్‌తో కార్మికులకు మూడు షిఫ్టుల ఉపాధి లభిస్తున్నదన్నారు. లంచాల ప్రసక్తి లేకుండా టీఎస్‌ఐపాస్ ద్వారా అనుమతులు 15రోజుల్లో సులభంగా ఇస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పారిశ్రామికవాడలు ఇప్పుడు కళకళలాడుతున్నాయని చెప్పారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్మికులు, పారిశ్రామికవేత్తలు, సిబ్బంది బీఆర్‌ఎస్‌కు మద్దతుగా ఉంటామనడం సంతోషాన్ని కల్గిస్తున్నదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మీ ఆశీస్సులుంటే మూడోమారు గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు నగేశ్, శ్రీధర్‌చారి, అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాస్‌రావు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన చిన్నతరహా పారిశ్రామికవేత్తలు, కార్మికులు

---

# ఆశీర్వదించండి.. సైనికుడిలా పనిచేస్తా..

**సదాశివపేట ఎన్నికల ప్రచారంలో సంగారెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్**

సదాశివపేట, నవంబర్ 4: ఈనెల 30న జరిగే ఎన్నికల్లో గెలిపిస్తే, మీకోసం సైనికుడిగా మీకోసం పని చేస్తానని చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్, సంగారెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తాను ఓడిపోయినా ప్రజల్లోనే ఉన్నానని, గెలిచిన జగ్గారెడ్డి పత్తాలేడని గుర్తుచేశాడు. శనివారం సదాశివపేట మండలంలోని నాగులపల్లి, కోనాపూర్, ఆరూర్, మెలిగిరిపేట గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు బాణాసంచా, డప్పు చప్పుళ్ల హోరుతో చింతా ప్రభాకర్‌కు ఘన స్వాగతం పలికారు. మహిళలు తిలకం పెట్టి మంగళ హారతులతో స్వాగతం పలికారు. ప్రచార వాహనంపై పూలవర్షం కురిపిస్తూ నీరాజనం పలికారు. అభ్యర్థి చింతా ప్రభాకర్ కోనాపూర్‌లోని చర్చి, ఆరూర్‌లోని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కోనాపూర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు క్రేన్ సహాయంతో భారీ గజమాల వేసి చింతా ప్రభాకర్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వచ్చి మాయమాటలు చెప్పే జగ్గారెడ్డికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత మార్పు, తెలంగాణ రాకముందు మార్పును ప్రజలంతా గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మార్పు సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమైందన్నారు. అన్ని వర్గాలను ఆదుకుంటూ అండగా నిలుస్తున్నదని బీఆర్‌ఎస్ అని, అభివృద్ధి సంక్షేమ పథకాలలో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నట్లు చెప్పారు. చేసిన అభివృద్ధిని వివరిస్తూ కారుగుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ప్రచారంలో సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, ఎంపీపీ యాదమ్మ, సర్పంచ్‌లు నగేశ్, సంగమేశ్వర్, హన్మంత్‌రెడ్డి, లక్మారెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి ఆరిఫొద్దీన్, బీఆర్‌ఎస్ నియోజవర్గ నాయకుడు ఆత్మకూర్ నగేశ్, బీఆర్‌ఎస్ నాయకుడు శివరాజ్‌పాటిల్, సొసైటీ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, ఎంపీటీసీ లలిత, సునితా సుధాకర్, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్


నాగులపల్లిలో బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌ను ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు


ఆరూర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌కు తిలకందిద్ది, స్వాగతం పలుకుతున్న మహిళలు

---

## ఎమ్మెల్యేకు మద్దతుగా
# భారీగా చేరికలు

అందోల్, నవంబర్ 4: అందోల్ ఎమ్మెల్యే అభ్యర్థి చంటి క్రాంతికిరణ్, సంగారెడ్డి జడ్పీచైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, స్టేట్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీజేపీ సీనియర్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. అందోల్-జోగిపేటలో శనివారం నిర్వహించిన యువ ఆత్మీయ సమ్మేళనంలో చేరిన యువకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ప్రతిఫలమే బీఆర్‌ఎస్‌కు బలంగా మారి పార్టీలో వలుసలుగా చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ ఇచ్చే గ్యారెంటీలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని, కాంగ్రెస్ పాలనపై ప్రజలకు విసుగుచెంది, బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, ఇచ్చిన మాటను నిలబెట్టుకునే సీఎం కేసీఆర్ పాలన నచ్చే పార్టీలో చేరుతున్నారన్నారు. మారుమూల గ్రామం సైతం బీఆర్‌ఎస్ హయాంలో అభివృద్ధి చెందిందన్నారు. అభివృద్ధిని చూసే ప్రతిపక్ష పార్టీల్లో నిలవక బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలుపుతూ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే అన్నారు.


అందోల్ : పార్టీలో చేరిన వారికి కండువా కప్పి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి చంటి క్రాంతి కిరణ్, స్టేట్ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి